AP 4PG 23 11 2024 SATURDAY qxp_Layout 1 22-11-2024 08:58 PM Page 1

విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
శనివారం 23 - 11 - 2024

# ప్రైవేట్ కేసులకూ వెనుకాడం

- వైఎస్ జగన్‌పై అసభ్యకర పోస్టింగ్స్‌పై చర్యలు తీసుకోవాలి
- లోకేష్, అనిత, అయ్యన్నపాత్రుడు, అచ్చెన్నాయుడుపై కేసు రిజిస్టర్ చేయాలి
- చట్టాన్ని కొందరికి చుట్టంగా మారుస్తామంటే ఉపేక్షించం
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ
- అసభ్యకర పోస్టింగ్స్‌పై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు






అనంతపురం, నవంబర్ 22 (అనంత ప్రభ)
"చట్టం అనేది అందరికీ ఒకేలా వర్తించాలి. కానీ ఈ రోజు చట్టాన్ని కొందరికి చుట్టంగా మారుస్తామంటే ఉపేక్షించేది లేదు. వైఎస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన పోస్టింగ్స్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. లేదంటే ప్రైవేట్ కేసులు వేయడానికి వెనుకాడము" అని అనంతపురం జిల్లా వైసీపీ అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో చేసిన పోస్టులపై అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైసీపీ లీగల్ సెల్ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. నారా లోకేష్, వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడుకు చెందిన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాల నుంచి చేసిన పోస్టులను సీఐ శ్రీకాంత్ యాదవ్‌కు అనంత వెంకటరామిరెడ్డి వివరించారు. సదరు ట్వీట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మీడియాతో అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ జగన్‌పై చేసిన మార్ఫింగ్ పోస్టులు తమ మనోభావాలు గాయపరిచేలా ఉన్నాయన్నారు. ప్రస్తుతం మంత్రులుగా ఉన్న లోకేష్, అచ్చెన్నాయుడు, అనిత, స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు రిజిస్టర్ చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. నారా లోకేష్ ఆఫీస్‌లోనే ఈ పోస్టింగ్స్‌లు తయారు చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఎవరైనా సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసిన పోస్టులు చేస్తే చర్యలు తీసుకుంటామని చంద్రబాబు చెబుతున్నారని, కానీ అవి మాటలకే పరిమితం అవుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కాకుండా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. అందరికీ సమానంగా చట్టం అమలు అయ్యేలా చూడాలని కోరారు. తాము చేసిన ఫిర్యాదును రిజిస్టర్ చేయకపోతే చట్టపరంగా ముందుకెళ్తామని, ప్రైవేట్ కేసులకూ వెనుకాడేది లేదని అన్నారు. న్యాయపరంగా ఎంతవరకైనా వెళ్తామని స్పష్టం చేశారు. అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్‌పై అవమానకర రీతిలో పోస్టింగ్స్ పెడుతున్నారని, వీటిని అరికట్టాలన్నారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దోషులను శిక్షించాలన్నారు. ఏఏ సోషల్ మీడియా ఖా తా ల్లో ం చి అసభ్యకర పోస్టింగ్స్ చేశారో ఆ వివరాలను సీఐకి అందజేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, సోషల్ మీడియా కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని తెలిపారు. జగన్‌ను కించపరిచేలా ఐ టీడీపీ సోషల్ మీడియా ఖాతా నుంచి అసభ్య పోస్టింగ్స్ పెడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. వైసీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు ఉమాపతి మాట్లాడుతూ వైఎస్ జగన్‌పై పెట్టిన అసభ్యపోస్టింగ్స్‌పై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కేసు రిజిస్టర్ చేయని పక్షంలో న్యాయపరంగా కోర్టును ఆశ్రయించి కేసు రిజిస్టర్ అయ్యేలా చూస్తామన్నారు.

# ఉద్యోగుల క్రికెట్ అభినందనీయం




- ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ లోగోను ఆవిష్కరించిన డిఆర్ఓ మాలోల
- మచ్చా రామలింగారెడ్డి రామలింగారెడ్డి కృషి అభినందనీయం

అనంతపురం, నవంబర్ 22 (అనంత ప్రభ)
అనంతలో వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు ప్రత్యేకంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని ఉద్యోగుల ఐకమత్యానికి ఇటువంటి క్రీడా పోటీలు ఉపయోగపడతాయని ఉద్యోగులందరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడం ఒక శుభపరిణామమని అన్ని డిపార్ట్మెంట్లు ఇందులో పాల్గొనడం వారి ఆరోగ్యానికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయని అనంతపురం డిఆర్ఓ మాలోల అన్నారు
అనంతపురం కలెక్టర్ కార్యాలయంలోని డిఆర్ఓ ఆఫీస్ నందు ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్ లోగోను అనంతపురం డిఆర్ఓ మాలోల వెటర్న్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాలోల మాట్లాడుతూ అనంతలో ఆర్డిటి చేస్తున్న సేవలు క్రీడాభివృద్ధికి వెలకట్టలేనివని ఇటువంటి క్రికెట్ పోటీలు ఉద్యోగులు అందరూ క్రీడా స్ఫూర్తితో ఈ పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.
ఉద్యోగుల కోసం ఇటువంటి ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు మచ్చా రామలింగారెడ్డి చేస్తున్న కృషి ఎందరికో స్ఫూర్తినిస్తుందని డిఆర్ఓ మాలోల అన్నారు.మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగస్తులందరినీ ఒక వేదిక మీదకు తీసుకొచ్చి క్రికెట్ స్ఫూర్తిని నింపాలన లక్ష్యంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఇందులో మొత్తం 20 ఎంప్లాయిస్ క్రికెట్ జట్టులు ఆడుతున్నాయని ఈనెల 24 నుంచి 2 నెలలు పాటు టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు విజయరాజు, సతీష్, మారుతి, శ్రీకాంత్, నరేష్ ఇతర సభ్యులు పాల్గొన్నారు

# రాప్తాడు లోవోల్టేజ్ సమస్యపై విద్యుత్ శాఖ మంత్రి కి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

- నూతన విద్యుత్ సబ్ స్టేషన్ల కోసం
- విద్యుత్ శాఖ మంత్రి కి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే
- విద్యుత్ శాఖ మంత్రి ఆదేశాలతో
- నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించిన ఈ ఈ, డి ఈ లు
- 2025 జనవరి నెల ఆఖరికి సంక్రాంతి పండుగ కానుకగా సబ్ స్టేషన్ల నిర్మాణం



రాప్తాడు, నవంబర్ 22 (అనంత ప్రభ)
రాప్తాడు నియోజకవర్గంలో లోవోల్టేజ్ సమస్యను అధిగమించేలా నూతన సబ్స్టేషన్లు మంజూరు చేయాలని విద్యుత్ శాఖ మంత్రి కి రాప్తాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత
శాసనసభ సమావేశాలలో భాగంగా రెండు రోజుల క్రితం విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవి ని రాప్తాడు నియోజకవర్గం లో లో వోల్టేజ్ సమస్యను అధిగమించడానికి నియోజకవర్గ వ్యాప్తంగా లో వోల్టేజ్ తో సతమతమవుతున్న రైతులకు కోసం నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్ లను ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం విద్యుత్ శాఖ మంత్రి ఆదేశాల మేరకు కన్స్ట్రక్షన్ ఇఇ మనోరమ, డిఇ రంగస్వామి, ఆత్మకూరు విద్యుత్ శాఖ ఏఈ బండి దాస్ తదితర అధికారులు శుక్రవారం రోజున సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం ఆత్మకూరు మండలం గోరిదిండ్ల, తోపుదుర్తి, గ్రామాల నందు స్థల పరిశీలనను చేయడం జరిగింది. 2025 జనవరి నెల ఆఖరికి అంతా సంక్రాంతి పండుగ కానుకగా నూతన సబ్‌స్టేషన్లు లో నిర్మించబోతున్నామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు మండల కన్వీనర్ బోయ గంతి శ్రీనివాసులు పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి , పాపంపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పిటిసి కొల్లాయప్ప, మాజీ సర్పంచ్ బాలనాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యులు రాము, సందీప్ చౌదరి, అశ్వర్థప్ప, సత్యనారాయణ చౌదరి, లింగమయ్య రాజేష్ కుమార్, జగన్ సురేష్ ,గౌరిదిండ్ల తోపుదుర్తి గ్రామాల రైతులు ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని స్థల పరిశీలనను అధికారుల తోపాటు సందర్శించడం జరిగింది.

# పి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర మహాసభల లోగోను విడుదల చేసిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ





అనంతపురం, నవంబర్ 22 (అనంత ప్రభ)
ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర మహాసభలకు సంబంధించిన లోగో విడుదల చేసిన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ గారు,ఈ సందర్భంగా పి. యఫ్. ఎస్. ఐ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ ఆలం గారు మాట్లాడుతూ డిసెంబర్ 9, 10 11, అనంతపురంలో జరిగే పి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను. పి ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘం స్వేచ్ఛ శాంతి పురోగతి లక్ష్యాలతో, చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అని నిదానంతో దేశంలో నిత్యం విద్యార్థులు ఎదుర్కొన్నటువంటి సమస్యలపై విద్యార్థులందరికీ విద్యా అందాలనే లక్ష్యంతో అనునిత్యం పోరాటం నిర్వహించే విద్యార్థి సంఘం పిఎస్ఎఫ్ అని తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పి. ఎస్. యఫ్. ఐ.విద్యార్థి సంఘం కీలకపాత్ర పోషించాలని, విద్యను కాపాడుకోవడం విద్యార్థి సంఘం బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి,ప్రతిభ భారతి, పి ఎస్ ఎఫ్ ఐ జిల్లా నాయకులు ,మౌనిక,అనిల్, కరుణాకర్, సుచిత్ర, వసంత,దతీష్, గణేష్,తదితరులు పాల్గొన్నారు

# ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ గా పూల నాగరాజు



అనంతపురం, నవంబర్ 22 (అనంత ప్రభ)
ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ గా పూల నాగరాజు ఎన్నిక కావడం జరిగింది. నూతనంగా ఎన్నికైన ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ చైర్మన్ పూల నాగరాజు ప్రమాణ స్వీకారం సందర్భంగా పూల నాగరాజు ని అనంతపురం పట్టణం నందు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల నాగరాజు కి శుభాకాంక్షలు తెలియజేసిన పామిడి టీడీపి నాయకులు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలైనటువంటి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కత్రిమల ప్రభాకర్ చౌదరి, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవ,మాజీ మున్సిపల్ చైర్మన్ గౌస్ పీరా, మాజీ ఎంపీటీసీ నల్లబోతుల శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు హమాలీ గోపాల్ మరియు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# బనానా రైలు ప్రారంభోత్సవములో పాల్గొన్న యాడికి మండల టిడిపి నాయకులు, రైతులు






యాడికి, నవంబర్ 22 (అనంత ప్రభ)
తాడిపత్రి రైల్వే స్టేషన్లో శుక్రవారం తాడపత్రి రైల్వే స్టేషన్ నుంచి ముంబైకి, ముంబై నుంచి షిప్పు ద్వారా ఇరాక్ దేశానికి అరటి ఉత్పత్తులతో వెళ్లే బనానా రైలును పచ్చ జెండా ఊపి ప్రారంభించే కార్యక్రమంలో తాడపత్రి మున్సిపల్ చైర్ పర్సన్ జెసి ప్రభాకర్ రెడ్డి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, మొదలైన అధికారులు పాల్గొన్నారు. ఈ బనానా రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో యాడికి మండల టిడిపి కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి పరిమి చరణ్, మదమంచి శివ, తదితర తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుద్రమ నాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లకు మన అనంతపురం జిల్లా రైతుల ఉత్పత్తులను చేరవేస్తున్నటువంటి ఈ కార్యక్రమం మన వ్యవసాయ రంగానికి మంచి ప్రోత్సాహకంగా నిలుస్తుంది అని, తాడపత్రి నియోజకవర్గంలోని అరటి ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అయ్యేటట్లు రైతులకు రైలు సౌకర్యం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, తాడపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు

# బంజారాల సంస్కృతి సంప్రదాయాలు ఆదర్శనీయం - కేంద్రీయ విద్యాలయ విద్యార్థినులు సందర్శన




ఉరవకొండ, నవంబర్ 22 (అనంత ప్రభ)
బంజారాల సంస్కృతి సాంప్రదాయాలు ఆదర్శనీయమని కనుమరుగవుతున్న సాంప్రదాయాలను విభిన్న కళలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బంజారా సంఘం ప్రతినిధి ఎస్ కే సుబ్రహ్మణ్యం నాయక్ పేర్కొన్నారు శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు రూపా నాయక్ తండాను సంస్కృతి వేషధారణ వారి ఆహారపు అలవాట్లను పరిశీలన నిమిత్తం సందర్శించారు సందర్భంగా సింధూ నాగరికత నుంచి మొదలైన సంస్కృతిని వివరిస్తూ ఆంగ్లేయులతో విరోచితంగా పోరాడి చిట్టి గ్యాంగ్ అనే నిర్బంధ వెట్టిచాకిరి వ్యవస్థ నుంచి విముక్తి కల్పించిన బంజారా భూక్య బాణా నాయక్ వాడిన దాల్ తల్వార్ లను విద్యార్థులను చూపించారు అలాగే సంస్కృతి సంబంధించిన నంగారా వాటి ప్రత్యేకత నంగారా ను ఎందుకు వాడుతారు అనే విషయాలను విద్యార్థులకు వివరించారు అనంతరం బంజారా మహిళల వేషధారణ వాటి ప్రత్యేకత వాటిని ధరించాల్సినటువంటి ఆవశ్యకత గురించి తెలియజేశారు అనంతరం బంజారా మహిళలు చేసే నృత్యాలను తిలకించారు గిరిజన ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు ముచ్చటించారు బంజారా లు

## స్వామివారి భూములు ఆలయ అభివృద్ధికి ఉపయోగపడేలా చూడండి



యాడికి, నవంబర్ 22 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ భూములు దేవాలయ అభివృద్ధికి ఉపయోగపడేలా చూడాలని తాడపత్రి అసెంబ్లీ కో కన్వీనర్ పొట్టే గంగాధర్ తెలిపారు. శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాలతో దేవస్థాన భూములను విచారణ చేపట్టడానికి వచ్చిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేష నాయుడుతో పొట్టే గంగాధర్ మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ భూములు ఆక్రమణలకు గురి కావడం జరిగిందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆలయ ఈవో దుర్గాప్రసాద్ పై చర్యలు చేపట్టాలని, ఆలయానికి వచ్చిన స్వామి భక్తులకు సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు

## టిడిపి సభ్యత్వ నమోదు తో అండగా భీమా..



పామిడి, నవంబర్ 22 (అనంత ప్రభ)
రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు నియోజకవర్గ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు ఎద్దులపల్లి గ్రామం నందు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ గౌస్ పీరా మాట్లాడుతూ రూ 100 చెల్లించిన వారికి గతంలో ఉన్నటువంటి రెండు లక్షల బీమా ను ప్రస్తుతం ఐదు లక్షలకు పెంచడం జరిగిందని, అంతేకాకుండా సభ్యత్వ నమోదు కార్డు ఉన్న వ్యక్తి చనిపోయిన రోజే పదివేల రూపాయలు తక్షణ సాయం అందుతుందని, ప్రతి ఒక్క కార్యకర్తకి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గౌస్ పీరా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, జింకల సంజీవ, వెంకటరామిరెడ్డి, సుంకప్ప,, నల్లబోతుల శీన, హమాలీ గోపాల్, వెంకటనారాయణ, శివ, జయరాముడు, తిమ్మప్ప, రాజు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది..

## కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా ముందడుగు..



గుత్తి, నవంబర్ 22 (అనంత ప్రభ)
హైకోర్టు బెంచి ని కర్నూలు నందు ఏర్పాటు చేయుటకు అసెంబ్లీ లో తీర్మానం చేసినందుకు మరియు హెచ్ ఆర్ సి, లోకాయుక్త ట్రిబ్యునల్ లను కర్నూల్ లోనే కొనసాగిస్తామని ప్రకటించిన సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కర్నూలులో హైకోర్టు బెంచును ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం కూడా చేయడం జరిగిందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నందు సమావేశంలో ప్రసిడెంట్ ఎంకె. రామశర్మ, జనరల్ సెక్రటరీ నగదాని చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాదులు మనోహర్ బాబు, ఎం. మహమ్మద్ రసూల్, చలపతి, సుబ్రహ్మణ్యం,సాలప్ప, లీగల్ సెల్ సభ్యులు ఫకృబాషా, శ్రీనివాసులు, ఓబులేసు పాల్గొన్నారు..

## రాకెట్ల తండాలో సికెల్ సెల్ అనీమియా సర్వే



ఉరవకొండ, నవంబర్ 22 (అనంత ప్రభ)
రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో ఈ రోజు రాకెట్ల తాండలో సికెల్ సెల్ అనీమియా గుర్తించడానికి ఈ రోజు సర్వే కార్యక్రమం చేపట్టారు. ట్రైబల్ ప్రాంతాల్లో ప్రజలలో మొదట ఈ కార్యక్రమం చేసున్నారు. ఈ రక్తసంబంధ రుగ్మత వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది తెలిపారు. ఇంటింటికి తిరిగి 40 సంవత్సరాల ప్రజలందరికీ రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సర్వే ను ఏ ఎం ఎం పద్మావతి ఎం ఎల్ హెచ్ పి/ సి హెచ్ ఓ లు భవాని భారతి నాగసురేఖ హెబ్సిబా లు చేస్తుండగా సి హెచ్ ఓనాగరంగయ్య హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్. ఎం డి. షఫీ సూపర్వైజర్ శేఖర్ పర్యవేక్షించారు.

## జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినీ సుమా..



కూడేరు, నవంబర్ 22 (అనంత ప్రభ)
కూడేరు మండలం స్థానిక మండల పరిధిలోని జల్లిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుమా అండర్ 14 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో బాపట్లలో ఈనెల 9 నుంచి 12 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జల్లిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యను అభ్యసిస్తున్న సుమ తన టీమ్ కు కెప్టెన్గా వ్యవహరించి ప్రతిభను కనబరిచి వారి జట్టును గెలిపించిన సుమా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబర్ నెలలో 10 నుంచి 12 వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలియజేశారు. సుమ అనే విద్యార్థిని జాతీయ స్థాయికి కావడానికి శిక్షణ ఇచ్చిన పిఈటి రిజ్వాన కు విద్యార్థిని తల్లిదండ్రులు అభినందన తెలియజేశారు.

# బనానా రైలు ప్రారంభోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెల్పిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ




శింగనమల, నవంబర్ 22 (అనంత ప్రభ)
బనానా రైలు ప్రారంభోత్సవం సందర్భంగా శింగనమల నియోజకవర్గ రైతులకు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణి శ్రీ మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలో పుట్లూరు,యల్లనూరు,నార్పల,బుక్కరాయసముద్రం మండలాలలోని 6477 ఎకరాల్లో రైతులు పండించిన 4.9 మెట్రిక్ టన్నుల అరటి విదేశాలకు ఎగుమతి అవ్వడం పట్ల నియోజకవర్గ రైతులకు అభినందనలు తెలిపారు. రైతులు ఎన్నో కష్టాలు ఓర్చి పండించి అరటి ఈరోజు నియోజకవర్గ నుండి అత్యధికంగా ఎగుమతి అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గములోని అరటి ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అయ్యేటట్లు రైతులకు రైలు సౌకర్యం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.వ్యవసాయ మంత్రి కింజరపు అచ్చం నాయుడు , కృతజ్ఞతలు తెలిపారు. తాడిపత్రి నుండి ముంబై కు రైలు వెల్లుటకు పకడ్బందీగా సౌకర్యాలు కల్పించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ జిల్లా కలెక్టర్,జిల్లా అధికారులు కు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ భూములపై ఆరా తీసిన దేవాదాయ శాఖ అధికారులు



యాడికి, నవంబర్ 22 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ భూములపై దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషయ్య నాయుడు ఆరా తీశారు. శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి విచ్చేసిన అధికారులను వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఆలయ అర్చకులు హరిస్వామి కలిశారు. ఈ సందర్భంగా ఆదిశేషయ్య నాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీ చెన్నకేశవ స్వామి రథోత్సవం మండల నాయకులు అధికారులు ప్రజల ఆధ్వర్యంలో కన్నుల పండుగగా జరుగుతుందని సంతోషం వ్యక్తం చేస్తూ, స్వామివారికి గతము నుండి ఇప్పటివరకు ఉన్న ఆలయమాన్యం భూములు, ఆభరణాలు, నగదు మొదలైన వాటిపై వారితో చర్చించారు. గతంలో దాదాపు 250 ఎకరాలు ఆలయమాన్యం ఉండేదని ప్రస్తుతం ఎంత ఉన్నది అన్న విషయంపై ఆలయ ఈవో దుర్గాప్రసాద్ కు ఫోన్ చేసిన ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈవో దుర్గాప్రసాద్ పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. స్థానికులు ఆలయ ఈవో దాదాపు నెల రోజుల నుంచి ఆలయానికి రావడం లేదని తెలుపగా ఈవో పై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ వన్నూరు స్వామి, సీనియర్ అసిస్టెంట్ రామ తులసి, స్థానికులు పాల్గొన్నారు

## కెనరా బ్యాంకులో పని చేయని నగదు యంత్రాలు.. ఇబ్బందుల్లో లబ్ధిదారులు

- చోద్యం చూస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్ సిబ్బంది.
- కెనరా బ్యాంకు అల్లా స్టేట్ బ్యాంకు ఇలా.
- రెండూ రెండే



ఉరవకొండ, నవంబర్ 22 (అనంత ప్రభ)
పట్టణంలోని కెనరా బ్యాంకు ఆధ్వర్యంలోనిర్వహిస్తున్న నగదు జమాయంత్రాలు పనిచేయటం లేదు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. కెనరా బ్యాంకు సిబ్బంది గానీ మేనేజర్ గానిపనిచేయని నగదు జమాయంత్రాలపై దృష్టి సారించటం లేదు. నగదు జమ చేయడానికి వెళ్లిన ఖాతాదారులకు
చుక్కెదురయింది.

ఇది ఇలా ఉంటే ప్రభుత్వ కళాశాల ఎదురుగా ఉన్న స్టేట్ బ్యాంకు నగదు జమ యంత్రం కూడా పనిచేయకపోవడంతో ఖాతాదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. సాంకేతిక లోపాలను ఎప్పటికప్పుడు సరి చేయకపోవడంతో ఆయా బ్యాంకుల అందిస్తున్న లోపభూయిష్టమైన సేవలతో తరచూ విద్యార్థులు లబ్ధిదారులు మహిళలు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. బ్యాంకులు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడవడంతో బ్యాంకర్లు సిబ్బంది తమరి ని ఎవరు ప్రశ్నించరులే అనే ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ తీసుకున్న జీతానికి బ్యాంకర్లు ప్రజలు , ఖాతాదారుల పట్ల జవాబు దారితనంగా వ్యవహరించాలని కోరుతున్నారు

# ఘనంగా గణిత బ్రహ్మగా పేరొందిన "లక్కోజు సంజీవరాయశర్మ జయంతి వేడుకలు

- జన్మత అంధుడు
- అపర గణిత మేధావి.



ఉరవకొండ, నవంబర్ 22 (అనంత ప్రభ)
కడప జిల్లాకు చెందిన లక్కోజు సంజీవరాయశర్మ గొప్ప గణిత మేధావిగా పేరు గాంచారు. దేశ, విదేశీయుల చేత ప్రశంసలు అందుకున్నారు. ఆయన ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామానికి చెందినవారు. 1907 నవంబర్ 22న జన్మించారు. పుట్టుకతోనే చూపులేదు. అంధుడు పుట్టాడని పెంచడం కష్టమని.. గొంతు పిసికి దిబ్బలో పూడ్చేయాలని మంత్రసాని సలహా ఇచ్చింది. మరికొందరు మహిళలు పురిటి బిడ్డ నోట్లో వడ్ల గింజలు వేశారు. అయినా ఆ పసివాడు చావలేదు సరికదా.. చక్కగా ఆరోగ్యంగా ఎదిగాడు. ప్రపంచం ఈర్ష్యపడే స్థాయికి పేరుగాంచారు.

ఆ రోజులలో బ్రెయిలీ లిపి లేకపోవడంతో సంజీవరాయ శర్మ చదువుకునేందుకు వీలు కాలేదు. అక్క బడికి వెళ్లి వచ్చాక ఇంటి వద్ద పాఠాలను గట్టిగా చదువుతుంటే విని గుర్తు పెట్టుకునేవాడు. అలా ఆయనకు మామూలు పాఠాలతోపాటు గణితం బాగా వచ్చింది. అందులో అపార జ్ఞానం సాధించారు. అతని బాల్య దశలోనే తండ్రి చనిపోయారు. తల్లే పెంచింది.లి

పల్లెల్లో రైతులకు ధాన్యం ధర, భూమి కొలతలు తదితర అంశాలను సంజీవరాయశర్మ క్షణాల్లో చెప్పేవారు. రైతులు ఈ సాయానికి గానూ ఆయనకు అంతో.. ఇంతో డబ్బు ఇచ్చేవారు. ఆ వయసులోనే వయొలిన్ పట్ల ఆకర్షితుడై వాయించడం నేర్చుకున్నారు. తర్వాత వయొలిన్ వాయించడం జీవితంలో ఒక భాగమైంది.

-గణితంలో ప్రజ్ఞా

సాహిత్యంలో కవులు అవధానాలు చేయడం తెలిసిందే. అంటే 8 మంది వరుసగా ప్రశ్నలు వేస్తుంటే ఆయా అంశాలకు వెంట వెంటనే పద్యాల రూపంలో జవాబు చెప్పాలి. అలాగే గణితంలో కూడా అవధానం ఉంది. లక్కోజు సంజీవరాయ శర్మ గణితంలో అవధానాలు చేయడంలో దిట్టగా మారారు. పుట్టిన తేదీ, సంవత్సరం, ప్రదేశం, సమయం చెప్పగానే ఆయన దానికి సంబంధించిన తిధి, వార, నక్షత్ర, యోగ, కరణాలు చెప్పేసేవారు. దాంతోపాటు క్లుప్తంగా జాతకాన్ని కూడా తెలిపేవారు. అలా ఆయన దేశమంతటా మొత్తం 6 వేల గణిత అవధానాలు చేశారు. వేలాది మంది కూర్చున్న సభలో నిమిషానికి 20, 30 కష్టమైన లెక్కలకు అడిగిన వెంటనే సమాధానాలు చెప్పేవారు. ప్రశ్న అడగ్గానే వయొలిన్ను కొద్దిగా పలికించి వెంటనే సమాధానం చెప్పేవారు. ఈ విద్య ఎలా నేర్చుకున్నావు అని అడిగితే దైవ దత్తంగా వచ్చిందని బదులిచ్చేవారు. ప్రపంచంలోనే గణితం విషయంలో బెంగళూరుకు చెందిన శకుంతలాదేవి కంప్యూటర్ను ఓడించిందంటారు. అలాంటి శకుంతలాదేవినే ఓడించిన గొప్ప వ్యక్తి లక్కోజు సంజీవరాయశర్మ. ఎంత పెద్ద లెక్క అడిగినా కూడా క్షణాల్లో బదులిచ్చేవారు.

-గౌరవ పురస్కారాలు

గణితంలో లక్కోజు గొప్పతనం తెలిసి.. దేశమంతటా ఎందరో గొప్పవాళ్లు ఆయన అవధానాలకు వెళ్లేవారు. మరికొందరు పెద్దలు ప్రత్యేకంగా అవధానం చేయించి విని ఆశ్చర్యపోయేవారు. 1959లో నాటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ ఢిల్లీలో లక్కోజుతో గణిత అవధానాన్ని ఏర్పాటు చేయించి, తిలకించారు. ఆ కార్యక్రమానికి పండిట్ జవహర్లాల్ నెహ్రూ కూడా హాజరయ్యారు. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ 1996లో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. తొలిసారిగా 1928లో గణిత అవధానం చేశారు. 1995 వరకు దేశమంతటా 6 వేల ప్రదర్శనలు ఇచ్చారు. 1928 నవంబర్ 15న నంద్యాలలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో ప్రధాన ఆకర్షణగా నిలిచి వందలాది లెక్కలకు బదులిచ్చారు. 19 ఏళ్ల వయసులోనే వివాహమైంది. అప్పట్లో ఆయన సతీమణి వయసు 9 ఏళ్లు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. 1994 జనవరి 5న ఆమె శ్రీకాళహస్తిలో ఉండగా మరణించారు. సంజీవరాయశర్మ హైదరాబాద్లోని కుమారుడి వద్దకు చేరుకున్నారు. 1997 డిసెంబర్ 2న కన్నుమూశారు. ప్రపంచం మొత్తాన్ని తన అద్భుతమైన గణిత విద్యతో ఆకట్టుకున్న గొప్ప వ్యక్తి ఇంత వరకు ఈ భూమిపై మరొకరు పుట్టలేదని.. ప్రపంచంలోని గణిత మేధావులంతా ఎంతో ప్రశంసించారు.

ప్రపంచంలో అంధులైన మహా ప్రతిభావంతుల్లో జాన్మిల్టన్, బ్రెయిలీ కనుగొన్న లూయిస్ బ్రెయిల్ ,హెలెన్ కెల్లర్, ద్వారం వెంకటస్వామినాయుడు వంటివారు పుట్టుకతో అంధులు కారు. తదనంతర కాలంలో వారు అంధులయ్యారు. మన దేశంలో గణిత శాస్త్రజ్ఞుల్లో భాస్కరాచార్యులు, రామానుజన్, శకుంతలాదేవి వంటివారు మంచి శిక్షణ పొందారు. కానీ సంజీవరాయశర్మ అంధుడే కాక చదువు సంధ్యలు లేని వ్యక్తి. అంతా వినికిడి జ్ఞానమే... ప్రపంచంలో ఆరుగురు గణిత శాస్త్రజ్ఞుల్లో ఒకరు శర్మ. ఆనాడే బ్రిటిష్ వైస్రాయ్ "ఈయన మా దేశంలో పుట్టి వుంటే దేశం నడిబొడ్డున విగ్రహం పెట్టి రోజూ పూజలు చేసేవాళ్లం" అని శర్మనుద్దేశించి అన్నారు. శకుంతలాదేవి స్వయంగా నాకన్నా ప్రతిభావంతుడు అని అంగీకరించింది. అయినా ఆయన పేదరికంలోనే జీవించారు. శ్రీనివాస రామానుజన్ వంటి మేధావిని గుర్తించని దేశమిది.'అంక విద్యాసాగర' విశ్వసాంఖ్యాచార్య, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేట్ పొందిన శర్మ తన చివరి రోజుల్ని శ్రీకాళహస్తీశ్వరస్వామి సన్నిధిలో వయొలిన్ మీటుతూ స్వామినర్చిస్తూ గడిపారు! ఈ నోబెల్ బహుమతులు, మెగ్సెసేలు, జ్ఞాన్పీఠ్లు... ఆయన ప్రతిభ ముందు ఎంత చిన్నవో.

## ఆర్ అండ్ బి రోడ్డు ఇరువైపులా గడ్డి, కంప చెట్లను తొలగిస్తున్న సర్పంచ్



కూడేరు, నవంబర్ 22 (అనంత ప్రభ)
కూడేరు మండలం స్థానిక మండల పరిధిలోని జయపురం, చోళసముద్రం గ్రామాల మీదుగా నిత్యం కూడేరుకు వెళ్ళు ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆదేశాలతో తెదేపా రాష్ట్ర సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ వడ్డే రమాదేవి అధ్యక్షతన చోళసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్ అండ్ బి రోడ్డు ఇరువైపులా మరమ్మత్తు పనులు చేయిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు,గడ్డి పెరిగి పోవడంతో నిత్యం వివిధ పనుల మీద ప్రయాణిస్తున్న ప్రయాణికుల రవాణా సౌకర్యాల నిమిత్తం ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తారు రోడ్డుకు ఇరువైపులా పెరిగినటువంటి కంప చెట్లను అలాగే పెరిగిన పోయినటువంటి గడ్డిని జెసిబి లతో తొలగిస్తు మరమ్మత పనులు చేయిస్తున్నారు.

## ఉపాధి హామీ పనుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన డ్వామా పిడి



కూడేరు, నవంబర్ 22 (అనంత ప్రభ)
కూడేరు మండలం కేంద్రంలో జాతీయ ఉపాధి పనులను శుక్రవారం రోజున మండల కేంద్రం మరియు కరుట్లపల్లి గ్రామాలలో డ్వామా పిడి, ఏపీ డి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించారు. స్థానిక ఆయా గ్రామ పంచాయతీలలో ఇటీవల ప్రభుత్వం ద్వారా మంజూరు చేసినటువంటి ఉపాధి హామీ పనులను పురోగతి సాధించాలని ఉపాధి హామీ పనులపై నిర్లక్ష్యం ఉపాధి కూలీలకు సరిగా పని కల్పించకపోవడం మినీ గోకులం షెడ్లు, భూగర్భ జలాలను పెంచే ఇంకుడుగుంతలు ఏర్పాటు లాంటి పనుల త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధి పనులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డ్వామా పిడి సలీం భాష,ఏ పి డి శైలజ ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లను, ఫీల్డ్ అసిస్టెంట్ లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎస్,ఏ, డబ్ల్యు,ఏస్ ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలు సమర్పణ




కూడేరు, నవంబర్ 22 (అనంత ప్రభ)
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కుదేరు మండలం పి నారాయణపురం గ్రామ సచివాలయం దగ్గర లబ్ధిదారులతో కలసి సిపిఐ తాలూకా కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో స్థానిక శాఖ కార్యదర్శి కామ్రేడ్ చిన్న ఓబులేసు, లబ్ధిదారులు మహేశ్వరి, ఈశ్వరమ్మ, హర్షిత, అనిత, రాజేశ్వరి, వీరాంజనేయులు, రాము, ఆసాది రాము, మారెన్న, రాంప్రసాద్, మాలతి, నాగార్జున, రవి, నాగేంద్ర, సంజీవ రాయుడు, జక్కా అరుణ, జక్కా శ్యామల, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## అపార్ సెంటర్లను పెంచాలని టీ యన్ యస్ యఫ్ వినతి



ఉరవకొండ, నవంబర్ 22 (అనంత ప్రభ)
అపార్ సెంటర్స్ పెంచాలని కోరుతూ ఎమ్మార్వోకి శుక్రవారం టీ.ఎన్.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు బాణాల రాజశేఖర్ విన్నవించారు.

అపార్ కార్డుల విషయంలో,విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తహసీల్దార్ దృష్టికి ఆయన తెచ్చారు.విద్యార్థుల,తల్లిదండ్రుల పేరు మార్పు, డేట్ అఫ్ బర్త్ తదితర విషయాల యందు ఆధార్ క్యాంపుల సెంటర్లను పెంచాలని అలాగే జూనియర్ కళాశాలలో అదనపు సిస్టమ్స్ ఏర్పాటు చేయాలనిరాజశేఖర్ ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.అదనపు సెంటర్ల మంజూరు చర్యలు వేగవంతం గా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్, కార్తికేయ,,పల్లవి,చరిత ,సంజన తదితరులు పాల్గొన్నారు.

AP 4PG 23 11 2024 SATURDAY qxp_Layout 1 22-11-2024 08:58 PM Page 3









## ఆశ్చర్యపరుస్తున్న హైదరాబాదీ ఇడ్లీ



స్విగ్గీ ఆర్డర్లలో ఇడ్లీయే రాజానండి బాబూ.. అల్పాహారాల్లో ఇడ్లీకి ఉన్న క్రేజ్ అలాంటిదండి మరి..!

ఎందుకటే గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 3.3 కోట్ల ప్లేట్లను ఆ సంస్థ పంపిణీ చేసింది. అల్పాహార ప్రియుల్లో ఆ ఇడ్లీకి ఉన్న క్రేజ్ ఎంతో తన నివేదికలో వివరించింది. అంతేకాదు.. ఈ సిగ్గీ ద్వారానే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి అరుదైన రికార్డు సొంత చేసుకున్నాడు. ఆ విశేషాలంటో చదివేద్దామా?

ఇడ్లీ.. ఇడ్లీ.. ఇడ్లీ.. అవును! ఇడ్లీకి ఉన్న క్రేజే వేరు. పూర్వకాలం నుంచి అల్పాహారంగా దీనినే తీసుకుంటున్నారు. ఇడ్లీ లేని హెూటలూ ఉండదు. బెంగళూరు వాసులు రవ్వ ఇడ్లీలు, చెన్నై వాసులు నెయ్యి, పొడి ఇడ్లీలు ఇష్టపడితే.. హైదరాబాద్ వాసులు కారం పొడి, నెయ్యి, చట్నీలతో కూడిన ఇడ్లీలు ఇష్టపడతారు. అందుకే ఈ ఇడ్లీలకు ఎక్కడైనా డిమాండ్ ఉంటుంది. వీటి ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు.

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ ద్వారా గత ఏడాది కాలంగా రూ.ఆరు లక్షలను కేవలం ఇడ్లీల కోసమే ఖర్చు చేశాడంట. ఇడ్లీలంటే తనకు ఎంత ఇష్టమో ఈ రికార్డు ద్వారా నిరూపించాడు. తన కోసమే కాదు.. తన కుటుంబసభ్యులు, స్నేహితుల కోసం ఏడాది మొత్తంలో 8428 ప్లేట్ల ఇడ్లీలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు.. తాను ఎక్కడికి వెళితే అక్కడ స్విగ్గీలో ఆర్డర్ ఇచ్చేయడం ఈయనకు అలవాటు.

ప్రపంచ ఇడ్లీ దినోత్సవం నాడు ఇడ్లీ ఆర్డర్లపై నిర్వహించిన అధ్యయన నివేదికను స్విగ్గీ సంస్థ విడుదల చేసింది. మరోవైపు ఈ సంస్థ గత ఏడాదికాలంలో దేశవ్యాప్తంగా 3.3 కోట్ల ప్లేట్ల ఇడ్లీలను పంపిణీ చేసినట్టు తెలిపింది. ఆ నివేదిక ప్రకారం ఎక్కువ ఇడ్లీలను ఆర్డర్ చేసిన నగరాల్లో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్టు తెలిపింది.

కోల్‌కతా, కొచ్చి, ముంబై, కోయంబత్తూరు, పుణే, వైజాగ్, ఢిల్లీ నగరాలు నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది స్థానాల్లో ఉన్నాయి. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోయంబత్తూరు, ముంబై వాసులు డిన్నర్‌గా కూడా ఇడ్లీని ఎక్కువ ఇష్టపడుతున్నట్టు స్విగ్గీ తన సర్వేలో వెల్లడించింది.

చాలా మంది రాత్రి పూట టిఫిన్‌చేసే వాళ్లు కూడా ఇడ్లీపైనే మక్కువ చూపిస్తున్నట్టు ఫుడ్ డెలవరీ సంస్థ స్విగ్గీ పేర్కొంది. అయితే అల్పాహార ఆర్డర్స్‌లో మసాలా దోశ మాత్రం ఫస్ట్ ప్లేస్‌లో ఉంటే, ఇడ్లీ దానిని అనుసరిస్తోంది.

## మామిడిపండుతో టేస్టీ అండ్ సింపుల్ రెసిపీలు

సీజనల్ ఫ్రూట్ మామిడిపండు. వేసవిలో మాత్రమే దొరికే ఈ పండును కచ్చితంగా తినమని చెబుతారు పోషకాహార నిపుణులు. విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యుట్రియెంట్లు అధికంగా ఉంటాయి. ఇది తినడం వల్ల మన శరీరం ఇనుమును సులువుగా శోషించుకుంటుంది. జీర్ణ క్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక వ్యవస్థకు మామిడిపండు ఎంతో అవసరం. అలాగే బరువు తగ్గించే డైట్ లో కూడా ఇది ఒక భాగం. వీటిని తింటూ బరువును సులువుగా తగ్గొచ్చు. వైద్యులు కూడా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తింటూ బరువు తగ్గమని సూచిస్తారు. మామిడి పండుతో సింపుల్‌గా చేసుకునే రెసిపీలు ఇవిగో. వీటిని పెద్దగా వండాల్సిన అవసరం లేదు.

మామిడిపండు ఓట్స్ స్మూతీ
ఓట్స్ – రెండు స్పూన్లు
మామిడిపండు – ఒకటి
చియా సీడ్స్ – ఒక స్పూన్
నీళ్లు – ఒక గ్లాసు

తయారీ ఇలా
1. స్టవ్ మీద కళాయిపెట్టి అందులో ఒక గ్లాసు నీరు వేయాలి.
2. ఆ నీళ్లలో ఓట్స్, చియా సీడ్స్ వేసి ఉడికించాలి అవి మెత్తగా అయ్యాక చల్లారనివ్వాలి.
3. ఈ మొత్తం మిశ్రమాన్ని బ్లెండర్లో వేసి జ్యూస్ లా చేసుకోవాలి. 4. ఆ మిశ్రమాన్ని ఒక గ్లాసులో వేసి పైన మామిడి పండు ముక్కలను వేసుకోవాలి. మామిడి పండు ఓట్స్ స్మూతీ రెడీ అయినట్టే.

కొబ్బరితో మామిడిపండు ఓట్ మిల్
లేత కొబ్బరి – 50 గ్రాములు
కొబ్బరి పాలు – అర గ్లాసు
ఓట్స్ – అర కప్పు
మామిడిపండు ముక్కలు – అరకప్పు
డ్రై ఫ్రూట్స్ తరుగు – గుప్పెడు
తేనె – ఒక స్పూను
యాలకుల పొడి – చిటికెడు

1. ఒక గిన్నెలో పైన చెప్పిన అన్ని పదార్థాలను వేసి బాగా కలిపి రాత్రంతా ఉంచాలి.
2. గిన్నెపై మూత పెట్టడం మర్చిపోవద్దుచ లేదా ఫ్రిడ్జ్ లో పెట్టినా మంచిదే.
3. ఉదయం లేచాక వాటిని అల్పాహారంగా తింటే ఆరోగ్యానికి మంచిది. రుచి కూడా అదిరిపోతుంది.

మామిడి సలాడ్
వర్జిన్ ఆలివ్ ఆయిల్ – ఒక స్పూను
పాలకూర – గుప్పెడు
మామిడిపండు – ఒకటి
తేనె – ఒక స్పూను
మిరియాల పొడి– చిటికెడు

1. పాలకూర ఆకులను బాగా కడిగి సన్నగా తురుముకోవాలి.
2. మామిడిపండును కూడా సన్నగా తరగాలి.
3. సలాడ్ చేయడానికి ఒక గిన్నెను తీసుకొని అందులో ఆలివ్



ఆయిల్ వేసి గిన్నె కింద అడుగుభాగానికి బాగా పట్టించాలి.
4. ఆ గిన్నెలో పాలకూర తరుగును, మామిడిపండు తరుగును వేయాలి.
5. వాటిని బాగా కలపాలి. తేనే, పెప్పర్ కూడా చల్లి బాగా కలుపుకోవాలి.
6. ఆలివ్ ఆయిల్‌ను పైన చల్లుకొని సలాడ్ తినాలి.
ఈ మామిడి సలాడ్ కంటికి, చర్మానికి, మెదడుకు, కాలేయ పనితీరుకు మేలు చేస్తుంది.

## దగ్గుతో బాధపడుతుంటే కేవలం 10 నిమిషాల్లో ఇలా సిరప్‌ను ఇంట్లోనే తయారు చేసుకోండి

వాతావరణంతో పాటు వచ్చే రోగాల్లో ముఖ్యమైనవి జలుబు, దగ్గు, జ్వరం, అలెర్జీలు. వీటిలో అతి సాధారణంగా జలుబు, దగ్గు ఎక్కువ మందిని ప్రభావితం చేస్తాయి. మార్కెట్లో దొరికిన దగ్గు సిరప్‌లనే ఎక్కువ మంది వినియోగిస్తారు. అయితే పూర్వం ఈ దగ్గు సిరప్‌లు ఏవి ఉండేవి కాదు. వారు ఇంట్లోనే దగ్గుకు ఔషధాన్ని తయారు చేసుకొని తాగేవారు. కేవలం కొన్ని నిమిషాల్లోనే ఇది తయారైపోతుంది. ఎలాంటి సైడ్ ఎఫెక్టులూ ఉండవు. కాబట్టి సహజ పద్ధతిలో మీరు కూడా ఇంట్లోనే ఇలా దగ్గు సిరప్ తయారు చేసుకొని తాగితే మంచిది.

ఇంట్లోనే దగ్గు ఔషధం తయారీకి ఐదు పదార్థాలు కావాలి. తేనే, మిరియాలు, తులసి, అల్లం,



నిమ్మకాయ వంటి వాటితో ఈ ఔషధాన్ని తయారు చేస్తారు. వీటన్నింటిలో కూడా విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో నొప్పిని, మంటను నయం చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను దూరం చేస్తాయి. చల్లని వాతావరణంలో వచ్చే వ్యాధులతో పోరాడుతాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.

తయారీ ఇలా..
ఈ దగ్గు సిరప్ తయారు చేయడానికి ముందుగా కళాయిని స్టవ్ మీద పెట్టండి. ఆ కళాయిలో ఒక కప్పు నీరు, రెండు టేబుల్ స్పూన్ల అల్లం తరుగు, తరిగిన నిమ్మకాయ ముక్కలను వేయండి. మిశ్రమం సగానికి తగ్గేవరకు చిన్న మంట మీద మరిగించండి. తరువాత అర స్పూను మిరియాల పొడిని జోడించండి. అందులోనే నాలుగు తులసి ఆకులు వేసి మరిగించండి. తర్వాత స్టవ్ కట్టేయండి. గోర–ువెచ్చగా మారాక ఒక స్పూను తేనెను అందులో కలపండి. ఆ మిశ్రమాన్ని ఒక సీసాలో వేసి భద్రపరుచుకోండి. మూడు పూటలా భోజనం చేశాక ఒక టేబుల్ స్పూన్ ఔషధాన్ని తాగండి. ఇలా వారం రోజులపాటు ఈ ఔషధాన్ని సేవిస్తే దగ్గు సహజసిద్ధంగానే తగ్గిపోతుంది. సాధారణంగా వచ్చే దగ్గు అయితే ఈ ఔషధాలకు నయం అవుతుంది. ఈ ఔషధానికి దగ్గు నయం కాకుండా ఉంటే అది తీవ్రమైనదిగా పరిగణించవచ్.చు అప్పుడు వైద్యులను కలిసి అల్లోపతి మందులను వాడండి.

దగ్గు మందుల వల్ల తీవ్రమైన సైడ్ ఎఫెక్టులు వస్తున్నట్టు ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. కొన్ని దేశాల్లో కొన్ని రకాల దగ్గు మందులను నిషేధించారు. దానికి కారణం అందులో వాడుతున్న కొన్ని రసాయన సమ్మేళనాలే. ఇలా ఇంట్లోనే సహజసిద్ధంగా దగ్గు ఔషధాన్ని తయారు చేసుకుంటే, ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవు. చెడు ప్రభావాలు పడవు. ఈ మందు మీకు సరిగా పనిచేయకపోయినా, దీనివల్ల కలిగే నష్టం మాత్రం ఉండదు. కాబట్టి ఒకసారి దగ్గుకు ఈ ఔషధాన్ని తయారు చేసుకొని వాడి చూడండి. మీకు దీని వల్ల దగ్గు తగ్గితే భవిష్యత్తులో అల్లోపతి మందులు వాడాల్సిన అవసరం ఉండదు.

## మామిడిపండుతో మిల్క్‌షేక్.. వెరీ

పాలు ఆరోగ్యానికి చాలా మంచిది. ఏకాలమైనా వీటిని తీసుకోవాల్సిందే. అయితే, ఎండాకాలంలో పాలని వేడిగా తీసుకునే బదులు చల్లగా తాగితే బావుంటుంది కదా. అందుకే బెస్ట్ సమ్మర్ స్పెషల్ 5 మిల్క్ షేక్స్ చూడండి. వీటిని మీ డైట్‌లో చేర్చుకోండి.

డేట్ వాల్‌నట్ మిల్క్ షేక్

కావాల్సిన పదార్థాలు..

6 ఖర్జూరాలు 1 టేబుల్ స్పూన్ ఎండు ద్రాక్ష, 5 వాల్‌నట్స్ 1 కప్పు చల్లని పాలు.
తయారీ విధానం.. గిన్నెలో ఖర్జూరం, వాల్‌నట్స్, ఎండుద్రాక్ష వేయాలి. అరకప్పు వేడి నీటిని పోసి వాటిని 15 నిమిషాల పాటు నానబెట్టండి. నీటిని తీసి డేట్స్, వాల్‌నట్స్, ఎండుద్రాక్షలు వేసి బ్లెండ్ చేయండి. 1 కప్పు చల్లని పాలని బ్లెండర్ పోసి బాగా కలపండి. అంతే డేట్ వాల్‌నట్ మిల్క్ షేక్ రెడీ.

యాపిల్ బనానా మిల్క్ షేక్..
కావాల్సిన పదార్థాలు..

1 చిన్న ఆపిల్, 1 అరటిపండు, అర టీస్పూన్ యాలకుల పొడి, 1 కప్పు పాలు, 1 టేబుల్ స్పూన్ తేనె.

తయారీ విధానం..

యాపిల్, అరటిపండు తొక్కని తీసి ముక్కలుగా కట్ చేసి బ్లెండర్‌లో వేయండి. ఇప్పుడు తేనె, యాలకుల పొడి కూడా వేయాలి. దీనంతటిని మెత్తగా మిల్క్‌షేక్‌లా అయ్యే వరకూ బ్లెండ్ చేసి సర్వ్ చేయడమే.

మ్యాంగో మిల్క్ షేక్..
కావాల్సిన పదార్థాలు..
1 మామిడి పండు 1 కప్పు పాలు, 5 జీడిపప్పులు, 1 టేబుల్ స్పూన్ తేనె, చిటికెడు కుంకుమ



పువ్వు, తయారీ విధానం..

ఇప్పుడు బ్లెండర్‌లో మామిడిపండు, పాలు, జీడిపప్పు, చక్కెర, కుంకుమపువ్వు వేయండి. మెత్తగా షేక్‌ల చేయండి. దీనిని గ్లాసులో పోసి మామిడి పండు ముక్కలతో గార్నిష్ చేయండి.

డ్రై ఫ్రూట్ మిల్క్ షేక్..

డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచిది. అందుకే, సమ్మర్‌లోనూ వీటిని షేక్స్‌లో వాడొచ్చు. అందుకోసం ఏమేం కావాలంటే..

10 జీడిపప్పులు, 5 బాదంపప్పులు, 5 పిస్తా పప్పులు 1 టీ స్పూన్ నానబెట్టిన ఎండుద్రాక్ష, 1 కప్పు పాలు 2 టీ స్పూన్ చక్కెర మీరు మరింత హెల్దీగా తాగాలనుకుంటే తేనె కూడా తీసుకోవచ్చు. చిటికెడు కుంకుమపువ్వు.
తయారీ విధానం.. ఓ గిన్నెలో జీడిపప్పు, బాదం, పిస్తా వేసి పావు కప్పు పాలు పోసి 10 నిమిషాలు నాననివ్వండి. ఇప్పుడు మిగిలిన పాలతో కలిపి బ్లెండ్ చేయండి. ఇప్పుడు కుంకుమపువ్వు, తేనె కూడా వేసుకి మెత్తగా మిల్క్ షేక్ చేసుకోండి. అంతే టేస్టీ మిల్క్ షేక్ రెడీ అయినట్లే.

## వేసవి తాపాన్ని తగ్గించి చల్లగా ఉంచే సూపర్ ఫుడ్స్



సూర్యుడి నెత్తి మీదకు చేరి చెమటగా మారి నాట్యమాడేస్తున్నాడు. వేసవి ఉక్కపోత నుంచి బయట పడటం చాలా కష్టం. కొంతమందికి అయితే చెమటలు కారుతూనే ఉంటాయి. ఫ్యాన్, ఏసీ, కూలర్ ముందే కూర్చుని సేద తీరతారు. చల్లని ఐస్ క్రీమ్స్, డ్రింక్స్ తాగితే పొట్ట కూడా హాయిగా ఉంటుంది. కొన్ని ఆరోగ్యకరమైన ఆహారాలు ఈ వేసవిలో శరీరానికి సరిపోకపోవచ్చు. కానీ కొన్ని మాత్రం శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. వేడిని సహజంగా తగ్గించడంలో మీకు సహాయపడే కొన్ని సూపర్ ఫుడ్స్ ఇవే. వీటిని తీసుకుంటే మండే ఎండలో కూడా చల్లగా ఉండవచ్చు.

◉ ఖుస్ గడ్డి నుంచి తయారు చేసేది ఖుస్ షర్బత్. ఇది మిమ్మల్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. అధిక వేడి వల్ల కళలు ఎర్రగా మంటలు అనిపిస్తాయి. ఆ ఫీలింగ్ తగ్గాలంటే ఖుస్ షర్బత్ తాగాల్సిందే.

◉ శరీరాన్ని చల్లబరిచే మరొక అద్భుతమైన పదార్థం సబ్జా. ఒక బాటిల్ నీళ్ళలో సబ్జా గింజలు వేసుకుని తాగుతూ ఉంటే చాలా బాగుంటుంది.

◉ కోకుమ్ జ్యూస్ తాగితే శరీరంలోని వేడి, మంట తగ్గించడానికి ఇదొక గొప్ప మార్గం. శరీరాన్ని చల్లబరుస్తుంది. నిర్జలీకరణాన్ని తగ్గిస్తుంది. వడదెబ్బ నుంచి రక్షణగా నిలుస్తుంది.

◉ బార్లీ నీరు నిర్జలీకరణాన్ని నివారించడంలో సహాయపడుతాయి. పుదీనా, కొత్తిమీర ఆకులు శరీరంలోని వేడిని తొలగిస్తాయి. శరీరంలోని వ్యర్థాలను తొలగించేస్తాయి.

ఇవి మీకు చల్లదనాన్ని మాత్రమే కాదు ఆరోగ్యాన్ని ఇస్తాయి. వేసవిలో ఈ ఉత్తమమైన ఆహారాలు చాలా తేలికగా ఉంటాయి. మిమ్మల్ని రిఫ్రెష్ గా ఉంచుతాయి. వేడిని దూరం చేస్తాయి. ఇవే కాదు కాలానుగుణమైన పండ్లు, కూరగాయలు తీసుకుంటే దాహాన్ని తీర్చేస్తాయి. ఇవే కాదు కొబ్బరి నీళ్ళు, పుచ్చకాయ, మజ్జిగ, కొత్తిమీర ఆకులు, పుదీనా ఆకులు, కీరదోస తీసుకున్నా మంచిది. కొబ్బరి నీళ్ళు తీసుకోవడం వల్ల శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్‌ని తిరిగి భర్తీ చేస్తుంది. తక్షణ శక్తిని అందిస్తుంది.

AP 4PG 23 11 2024 SATURDAY qxp_Layout 1 22-11-2024 08:58 PM Page 4



## బ్లాక్ శారీలో జిగేలుమనేలా సంకీర్తన .. బ్యాక్‌లెస్ అందాలతో రచ్చ





తెలుగు తెరపై కేరళ, కన్నడ భామలదే హవా. సినిమా ఏదైనా సరే వీరు ఉండాల్సిందే. ప్రతి ఏటా కొత్త కొత్త అందాలు టాలీవుడ్‌క దిగుమతి అవుతున్నాయి. అలా తెలుగు వారిని పలకరించారు సంకీర్తన విపిన్. యంగ్ హీరో సుహాస్ హీరోగా వచ్చిన జనక అయితే గనకతో ఈమె బాగా పాపులర్ అయ్యారు . సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే సంకీర్తన ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ వివరాల్లోకి వెళితే.

నవంబర్ 6, 2002న కేరళలోని కాసర్‌గాడ్ సమీపంలోని నీలేశ్వర్‌లో జన్మించారు సంకీర్తన విపిన్. సినిమాలు చేస్తూనే కెరీర్‌పై దృష్టి సారించిన ఈమె ప్రస్తుతం బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ ట్రావెల్ అండ్ టూరిజం) చదువుతున్నారు. సినిమాలను, చదువును బ్యాలెన్స్ చేస్తూ సంకీర్తన సాగుతున్నారు. చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తిని కనబరిచిన ఆమె .. ఓరు వడక్కన్ కెట్టుకద అనే మలయాళం వెబ్ సిరీస్ ద్వారా నటిగా మారారు. తొలి ప్రయత్నంలోనే అద్భుతమైన నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు సంకీర్తన.

అనంతరం గతేడాది రక్షిత్ అట్లూరి హీరోగా తెరకెక్కిన నరకాసురతో తెలుగు వారిని పలకరించారు. ఇందులో సంకీర్తన పోషించిన వీరమణి రోల్ ఆమెకు మంచి పేరు తీసుకొచ్చింది. పల్లెటూరి అమ్మాయిగా సంకీర్తన తన క్యూట్ లుక్స్‌తో జీవించేశారు. ఈ సినిమాతో వచ్చిన గుర్తింపుతో సంకీర్తనకు మరిన్ని అవకాశాలు వెల్లువెత్తడంతో పాటు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి దోహదం చేసింది.

ఈ సినిమా తర్వాత మరోసారి రక్షిత్ అట్లూరితోనే జత కట్టారు సంకీర్తన . వెంకట సత్య దర్శకత్వంలో వచ్చిన ఆపరేషన్ రావణ్ మూవీలో ఆమె నటించారు. ఈ ఏడాది జూలైలో రిలీజైన ఈ సినిమాలో ఆమె ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ ఆమనిగా సంకీర్తన జీవించారు. సస్పెన్స్ థ్రిల్లర్ మూవీగా తెరకెక్కిన ఈ సినిమాలో నిజాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ఆమె తీవ్రంగా ప్రయత్నిస్తారు.

ఇక లేటెస్ట్‌గా దిల్‌రాజు ప్రొడక్షన్స్‌లో అవకాశం దక్కించుకున్నారు సంకీర్తన విపిన్. అదే సుహాస్ హీరోగా వచ్చిన జనక అయితే గనక. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల్ని కనకూడదనే భర్తకు సహకరించే భార్యగా ఆమె అద్భుతంగా నటించారు. అమాయకత్వాన్ని ఒలికించడంతో పాటు పతాక సన్నివేశాల్లో శెభాష్ అనిపించుకున్నారు. భావోద్వేగాలు, డ్రామా పండించడంలో అప్పుడే ఆరి తేరిపోయారు సంకీర్తన. ఈమె జోరు చూస్తుంటే రాబోయే రోజుల్లో తెలుగు తెరను దున్నేస్తుందా అంటూ క్రిటిక్స్ అభిప్రాయపడుతున్నారు.

ఇక సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే సంకీర్తన విపిన్ .. తన వ్యక్తిగత, సినిమా సంగతులను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తాజాగా బ్లాక్ శారీలో చేసిన ఫోటో షూట్‌కు సంబంధించిన ఫోటోలను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. నడుము మడతలు, బ్యాక్ లెస్ అందాలను చూపిస్తూ సంకీర్తన మెరిసిపోతున్నారు. మరి ఇంకేందుకు ఆలస్యం సంకీర్తన అందాలను మీరూ చూసేయ్యండి.




## విజయ్ పార్టీలోకి ఆర్కే రోజా?.. ఆఫర్ ఇదే, వైసీపీ ఫైర్ బ్రాండ్ షాకింగ్ డెసిషన్



ఒకప్పుడు సౌతిండియాలో తిరుగులేని స్టార్ హీరోయిన్‌గా వెలుగొందారు రోజా. ఇండస్ట్రీలో గాడ్ ఫాదర్ లేకపోయినా తన కృషి, పట్టుదలతో ఈ స్థాయికి చేరుకున్నారు. సౌత్‌లోని అందరు స్టార్ హీరోలతో నటించి శెభాష్ అనిపించుకున్నారు. కెరీర్ పీక్స్‌లో ఉన్న దశలోనే దర్శకుడు ఆర్కే సెల్వమణితో ప్రేమలో పడి సుదీర్ఘకాలం డేటింగ్ తర్వాత ఇద్దరు ఒక్కటయ్యారు. రాజకీయాలపై తొలి నుంచి ఆసక్తి ఉండటంతో తెలుగుదేశం పార్టీలో చేరారు.

చంద్రబాబు నాయుడు తదితర టీడీపీ పెద్దల ప్రోత్సాహంతో ఆ పార్టీ మహిళా విభాగానికి అధ్యక్షురాలిగానూ పనిచేసి ఎన్నో ప్రజా పోరాటాలు చేశారు. 2009లో టీడీపీ అభ్యర్ధిగా చంద్రగిరి నుంచి పోటీ చేసి ఓటమి పాలైన రోజా.. తర్వాతి కాలంలో తెలుగుదేశానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాలనుకున్నారు. అయితే నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆకస్మిక మరణంతో కాంగ్రెస్‌లో పరిస్థితుల దృష్ట్యా ఆమె తన ఆలోచన విరమించుకున్నారు. అనంతరం వైఎస్ జగన్ సారథ్యంలోని వైసీపీలో చేరారు.

ఫైర్‌బ్రాండ్‌గా దూకుడుగా ఉండే ఆమెను జగన్ బాగా ప్రొత్సహించారు. ప్రత్యర్ధులపై వాడి వేడి విమర్శలు చేయడంలో రోజా ఎప్పుడూ ముందుంటారు. 2014లో నగరి నుంచి గెలిచి తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు రోజా. అప్పుడు వైసీపీ ప్రతిపక్షంలో ఉండటంతో జగన్ ఆదేశాల మేరకు ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశారు. 2019 ఎన్నికల్లో నగరి నుంచి మరోసారి విజయం సాధించారు.

ఆ ఎన్నికల్లో వైసీపీ సైతం అధికారంలోకి రావడంతో ఆమెను ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా నియమించారు జగన్. అనంతర కాలంలో జరిగిన మంత్రి వర్గ విస్తరణలో రోజాకు పర్యాటక, యువజన వ్యవహారాల శాఖను అప్పగించారు జగన్. అయితే 2024 ఎన్నికల్లో రోజా ఓటమి పాలవ్వడంతో పాటు హ్యాట్రిక్ సాధించాలన్న ఆమె కలలు కల్లలయ్యాయి. ఓటమి తర్వాత ఎక్కువగా ఇంటికే పరిమితమవుతున్న రోజా.. ఇటీవల మళ్లీ యాక్టీవ్ అవుతున్నారు.

అయితే కూటమి ప్రభుత్వం దెబ్బకు రోజా.. ఏపీ రాజకీయాలకు గుడ్ బై చెప్పి తమిళనాడు పొలిటిక్స్‌లో ఎంట్రీ ఇస్తారని ప్రచారం జరిగింది. ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ స్థాపించిన పార్టీలో ఆమె చేరుతారంటూ వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రోజా స్పందించారు. దివంగత జయలలిత తనను అన్నాడీఎంకేలో జాయిన్ అవ్వమని స్వయంగా అడిగారని కానీ ఏపీకి ఏదో చేయాలనే ఉద్దేశంతో తిరస్కరించానని రోజా తెలిపారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆంధ్రప్రదేశ్‌ను వదిలి వెళ్లేది లేదని ఆమె తేల్చిచెప్పారు. ఇక ఇళయ దళపతి పార్టీపై గురించి రోజా మాట్లాడుతూ.. విజయ్‌కి యూత్‌లో మంచి క్రేజ్ ఉందన్నారు. కానీ ఆయన సీఎం అవుతారో లేదో చెప్పలేమంటూ రోజా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ధనుష్‌తో వివాదం.. తండ్రీ కొడుకులిద్దరి పేర్లు తీస్తూ, నయన్ ఓపెన్ లెటర్





ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, లేడీ సూపర్‌స్టార్ నయనతారల వివాదం చర్చనీయాంశమైంది. తన పెళ్లి డాక్యుమెంటరీ తెరకెక్కించేందుకు 3 సెకన్ల క్లిప్ వాడుకుంటామని అడిగినందుకు ధనుష్ తమను రూ. 10 కోట్లు డిమాండ్ చేశారంటూ నయన్ బయటపెట్టడం, ఆపై కోర్టు కేసులతో వ్యవహారం మాంచి రంజుగా మారింది. ఈ నేపథ్యంలో నయనతార సోషల్ మీడియాలో పెట్టిన తాజా పోస్ట్ చిత్ర సీమలో వైరల్ అవుతోంది. ఈ వివరాల్లోకి వెళితే.

కోలీవుడ్ క్వీన్, లేడీ సూపర్‌స్టార్ నయనతార .. విఘ్నేశ్ శివన్‌ల పెళ్లి ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ పెళ్లి వీడియోను నయన్ .. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌కు భారీ రేట్‌కు విక్రయించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సంస్థ బియాండ్ ది ఫెయిరీటేల్ అనే పేరిట డాక్యుమెంటరీని రూపొందించింది. దీనిని నవంబర్ 18న విడుదల చేయాలని అనుకున్నారు.. అయితే ఈ డాక్యుమెంటరీ ఇంత ఆలస్యం కావడానికి హీరో ధనుష్ కారణమని ఆరోపిస్తూ ఆయనపై దాదాపు 3 పేజీల లేఖ రాసి ఘాటు విమర్శలు చేసింది లేడీ సూపర్‌స్టార్.

సినిమాల్లో కనిపించే ధనుష్‌కి, బయట కనిపించే ధనుష్‌కి సంబంధం లేదని.. వీరిద్దరూ వేరు వేరని మండిపడింది. సూక్తులు చెప్పే నువ్వు పాటించాలంటూ నయనతార చురకలు వేసింది. నిజానికి నయనతార - విఘ్నేష్‌ల ప్రేమ కథ మొదలైంది నయన్ - ధనుష్ నటించిన నానుమ్ రౌడీ దాన్ సినిమా సమయంలోనే. ఈ చిత్రానికి విఘ్నేష్ దర్శకుడు. తమ జీవితంలో ఎంతో కీలకమైన ఈ సినిమాలోని పాటలు, కొన్ని దృశ్యాలు వినియోగించుకోవడానికి ఆ చిత్ర నిర్మాత ధనుష్ అవకాశం ఇవ్వకపోవడం వివాదాస్పదమైంది.

అయితే సినిమాలోని క్లిప్స్ కాకుండా బిహైండ్ ది సీన్స్‌లోని తమ వ్యక్తిగత కెమెరాలలో తీసుకున్న విజువల్స్‌ని మూడు సెకన్ల పాటు తీసుకున్న క్లిప్‌ని ఈ డాక్యుమెంటరీలో వినియోగించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ధనుష్ కాపీ రైట్ యాక్ట్ కింద రూ. 10 కోట్లు నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. దీంతో నయన్ - ధనుష్ మధ్య వివాదం తారాస్థాయికి చేరినట్లయ్యింది.

ఇదిలాఉండగా.. డాక్యుమెంటరీ కోసం తమ సినిమాల్లోని క్లిప్స్, లిరిక్స్ వాడుకునేందుకు అవకాశం కల్పించిన సినీ ప్రముఖులకు నయనతార కృతజ్ఞతలు తెలిపారు. తన జీవితంలో ఎన్నో సినిమాలు తన మనసుకు దగ్గరయ్యానని.. వాటిని తన డాక్యుమెంటరీలో చేర్చాలని అడిగినప్పుడు సదరు దర్శక నిర్మాతలు ఎలాంటి అభ్యంతరం తెలపలేదని వారందరికీ ధన్యవాదాలు అంటూ పోస్ట్ పెట్టారు. ఇందులో తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా ఉన్నారు. వీరితో పాటు షారుఖ్ ఖాన్, గౌరీ ఖాన్ తదితర స్టార్స్‌కు కూడా నయనతార కృతజ్ఞతలు తెలిపారు. తనను విమర్శించి మిగిలిన హీరోలకు నయన్ థాంక్స్ చెప్పడంతో ధనుష్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## మెకానిక్ రాకీ రివ్యూ అండ్ రేటింగ్

హైదరాబాద్ లోనే కాలేజీ చదువుతూ చదువుతూ తనకి ఆ చదువు సరిగా అబ్బకపోవడంతో రాకీ(విశ్వక్ సేన్) ని తన గ్యారేజ్ లోనే మెకానిక్ గా పెట్టేస్తాడు వాళ్ళ నాన్న(నరేష్). అలా తన గ్యారేజిలో మెకానిక్ పనులు , ఇంకోపక్క డ్రైవింగ్ స్కూల్ పెట్టుకొని వచ్చే కస్టమర్స్ కి డ్రైవింగ్ నేర్పిస్తూ విశ్వక్ సేన్ లైఫ్ లీడ్ చేస్తాడు. ఈ సమయంలో మాయ(శ్రద్దా శ్రీనాథ్) ఓ ఇన్స్యూరెన్స్ ఏజెంట్ ని అంటూ అక్కడ డ్రైవింగ్ నెక్కుర్చుకోవడం కోసం వస్తుంది. ఆమెకి డ్రైవింగ్ నేర్పించే సమయంలో విశ్వక్ సేన్ తన గతాన్ని చెప్పడం స్టార్ట్ చేస్తాడు.

అందులో తన లవ్ ప్రియా (మీనాక్షి చౌదరి) తో లవ్ ట్రాక్ ఏంటి? అలాగే ఆమె అన్నయ్య(విశ్వదేవ్ రాచకొండ) తో స్నేహం, వాళ్ళ కుటుంబానికి జరిగిన విషాదం అలాగే విశ్వక్ సేన్ కి కూడా జరిగిన ఓ విషాదం తర్వాత మరిన్ని సమస్యల్లో పడతాడు. హైదరాబాద్ లోనే పేరు మోసిన ల్యాండ్ బ్రోకర్ రంకిరెడ్డి(సునీల్) తో వైరం ఏంటి? దానికి మించి విశ్వక్ సేన్ ఎదుర్కొన్న పీకల్లోతు కష్టాల నుంచి ఎలా బయటపడతాడు అనేది సినిమాలో మెకానిక్ రాకీ అసలు కథ..

విశ్వక్ సేన్ కి మాస్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. అలాగే తన స్క్రిప్ట్ సెలక్షన్ కూడా బాగుంటుంది అని ఒక మార్క్ కూడా ఉంది. కానీ తన లైనప్ పరమ రొటీన్ గా మారింది ఏంటని చాలా మంది ఈ సినిమా ట్రైలర్ చూసి అనుకోని ఉంటారు. అయినప్పటికీ ఏదో చేసి రిలీజ్ కి తీసుకొచ్చాడు మాస్ కా దాస్. కాగా ఆ ట్రైలర్ లలో చూపించినట్టుగానే పరమ రొటీన్ గా చికాకు తెప్పించేలా వెరీ బిలో యావరేజ్ గా ఫస్టాఫ్ అంతా సాగుతుంది.

కొన్ని సీన్స్ అంత నవ్వు కూడా తెప్పించవు, పాటలైతే అనవసరంగా సినిమాని సాగదీసినట్టుగా అనిపిస్తాయి. అలాగే అంతా ఫ్లాట్ కథనంలా కొనసాగుతూ ఒక బోర్ ఫస్టాఫ్ లా అనిపిస్తుంది. ఇక ఇంటర్వెల్ కి వచ్చే నాటికి చిన్నగా ఓ ట్విస్ట్ తో ఆత్రుత మొదలవుతుంది. ఇలా ఒక డల్ ఫస్టాఫ్ చూసిన తర్వాత ఆడియెన్ కి సెకండాఫ్ నుంచి మొదలవుతుంది అసలు ట్రీట్మెంట్. పూర్తిగా ఫస్టాఫ్ కి భిన్నంగా క్రేజీ లెవెల్లో సెకండాఫ్ స్క్రీన్ ప్లే కనిపిస్తుంది.

ఇక్కడ విశ్వక్ సేన్ స్క్రిప్ట్ సెలక్షన్ తప్పు కాదు అని థియేటర్ లో ఆడియెన్స్ తమ మైండ్ సెట్ మార్చుకొని ఆద్యంతం నెక్స్ట్ ఏం జరుగుతుంది అని ఆసక్తిగా ఎదురు చూస్తారు. కాగా ఈ క్రమంలో వచ్చే కొన్ని మైండ్ బ్లాకింగ్ ట్విస్ట్ లు నెక్స్ట్ లెవెల్లో ఉంటాయి. కొన్ని రోల్స్ ని అయితే అసలు ఆ రేంజ్ లో ఊహించలేం. వీటితో మాత్రం ఒక పక్కా పైసా వసూల్ సినిమా చూసిన అనుభూతి. ముఖ్యంగా మాస్ ఆడియెన్స్ కి ఈ సినిమా బాగా ఎక్కుతుంది. ముఖ్యంగా సెకండాఫ్ ని దర్శకుడు రవితేజ ముళ్ళపూడి సాలిడ్ థ్రిల్ ఎలిమెంట్స్ తో డిజైన్ చేసి మంచి ట్రీట్ అందించాడు. వీటి అన్నిటిని మించి వీరు ఇచ్చిన ఆన్లైన్ స్కామ్ అలర్ట్ మెసేజ్ దానిని మాస్ స్క్రీన్ ప్లే తో చెప్పడం బాగుంది.

ఇక నటీనటుల పెర్ఫామెన్స్ ల విషయానికి వస్తే.. ఈ సినిమాలో మెయిన్ లీడ్ అంతా మంచి నటన అందించారు అని చెప్పాలి. సినిమాలో హైలైట్స్ అండ్ సర్ప్రైజ్ మాత్రం విశ్వక్ సేన్ అండ్ శ్రద్ధా శ్రీనాథ్ లు అని చెప్పాలి. సెకండాఫ్ లో తమ రోల్స్ లో వారు చూపించిన షేడ్స్ అయితే అదిరిపోయాయి. అప్పటి వరకు ఒక యాంగిల్ లో కనిపించిన వీరు తర్వాత వారిలోని గ్రే షేడ్ ని అద్భుతంగా పండించారు.

విశ్వక్ సేన్ అయితే తన మాస్ కా దాస్ అనే ట్యాగ్ కి పక్కా నిర్వచనంగా కనిపిస్తాడు. తన డైలాగ్స్ కానీ లుక్స్, ఫైట్స్ ఇంకా పలు ఎమోషనల్ సీన్స్ ని చాలా బాగా చేసాడు. ఇంకా యంగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి మంచి రోల్ డీసెంట్ నటనతో పాటు సెకండాఫ్ లో విశ్వక్ తో ఓ సాంగ్ లో డాన్స్ అదరగొట్టి గ్లామర్ షో కూడా చూపించి ఆకట్టుకుంటుంది. ఇక 35 చిన్న




కథ కాదు ఫేమ్ యువ నటుడు విశ్వదేవ్ రాచకొండ ఈ సినిమాలో మంచి రోల్ లో కనిపించాడు. అలాగే విలన్ రోల్ లో సునీల్ ఇంప్రెస్ చేస్తాడు. ఇంకా నరేష్, హైపర్ ఆది, వైవా హర్షలు నవ్విస్తారు.

సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే.. సినిమాలో ప్రొడక్షన్ వ్యాల్యూస్ బాగున్నాయి. నేపథ్యానికి తగ్గట్టుగా గ్యారేజీ సెట్స్, మిడిల్ క్లాస్ ఇంట్లో సెటప్ లు ఇలా ఆర్ట్ వర్క్ బాగుంది. అలాగే ఎడిటింగ్ లో పాటలు అన్నీ తీసేసినా పర్వాలేదు. అలా చేస్తుంటే కథనం ఇంకా గ్రిప్పింగ్ గా మారి ఉండొచ్చు. జేక్స్ బీట్స్ బాగున్నాయి. సెకండాఫ్ లో స్క్రీన్ ప్లే నడిపించిన విధానం బాగుంది. ఇంకా నటీనటుల కాస్ట్యూమ్స్, డైలాగ్స్ బాగున్నాయి. సినిమాటోగ్రఫీలో కొన్ని షాట్స్ కొత్తగా ట్రై చేశారు.

ఫైనల్ గా చూస్తే.. ఓ సాధారణ మెకానిక్ షెడ్ లో మెకానిక్ డ్రైవింగ్ స్కూల్ నడుపుకునే కుర్రాడు ఇచ్చిన మాస్ ఎంటర్టైనర్ ఇది అని చెప్పొచ్చు. ఎక్కువ రివీల్ చేయకూడదు కానీ సెకండాఫ్ లో విశ్వక్ రోల్ హైలైట్ గా కనిపిస్తుంది. సినిమాలో టచ్ చేసిన సోషల్ ఇష్యూ దాని అనుగుణంగా మాస్ ట్రీట్మెంట్ డెఫినెట్ గా థ్రిల్ చేస్తుంది. కాకపోతే సినిమాలో ఫస్టాఫ్ మాత్రం ఆకట్టుకోదు. ఇది పక్కన పెడితే థియేటర్స్ లో క్రేజీ ట్విస్ట్ లతో మాస్ కథనంని ఇష్టపడే ఆడియెన్స్ మెకానిక్ రాకీ ని తప్పకుండా వీక్షించవచ్చు.

PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com